ఒడిదుడుకులతో రొయ్య సాగు

- అయోమయంలో ఆక్వా రైతులు
- ధర పతనంతో నష్టాల బాట



రొయ్యలను ఎగుమతి చేస్తున్న కూలీలు

గణపవరం: అసలే నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రొయ్య సాగుకు ట్రంప్ సుంకాల దెబ్బ గట్టిగానే తగిలింది. అన్ని రకాల కౌంట్ రొయ్యల ధర ఢమాల్‌మంది. ఒక్క రోజులోనే కేజీ రొయ్య ధర రూ.50 నుంచి రూ.60 వరకు పడిపోయింది. దీంతో రొయ్య రైతులు లబోదిబోమంటున్నారు. ట్రంప్ ఇటీవల రెండో విడతగా భారత దిగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచుతున్నట్లు ప్రకటించిన రోజే రొయ్య ధర పడిపోవడం గమనార్హం. ఇప్పటికే వ్యాధులు చుట్టుముట్టి 75 శాతం రొయ్యల చెరువులు ఖాళీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా మాత్రమే రొయ్య సాగు కొనసాగుతుంది. దీంతో సరకు అవసరానికి సరిపడా లేకపోవడంతో వ్యాపారులు రొయ్య ధర బాగా పెంచేశారు. ఈ నెల ఆరంభం నుంచి రొయ్య ధర కిలోకు రూ.60 నుంచి రూ.100 వరకూ పెరగడంతో రొయ్య రైతులు సంబరపడ్డారు. అప్పటికే చాలా చెరువులు ఖాళీ అవడంతో మిగిలిన కొద్దిపాటి రైతులకైనా పెంచిన ధరలు దక్కి, నష్టాల ఊబి నుంచి బయటపడతారని ఆశించారు. అయితే అనుకోని పిడుగులా రెండో సారి ట్రంప్ సుంకాల పెంపుదల రొయ్య ధరపై తీవ్ర ప్రభావం చూపింది.

భారీగా తగ్గిన ధర

దీంతో 100 కౌంట్ రొయ్య కిలో రూ.280 వరకూ కొనుగోలు చేయగా ట్రంప్ భారత్ దిగుమతులపై మరో 25 శాతం సుంకాలు పెంచినట్లు ప్రకటించడంతో ఒక్క సారిగా 100 కౌంట్ రొయ్య ధర కిలో రూ.220 పడిపోయింది. ఇటీవల చెరువులు ఖాళీ అయ్యి రొయ్యలు దొరకకపోవడంతో మళ్లీ రూ.20 పెంచి, కిలో రూ.240కి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇక మిగిలిన కౌంట్‌లో ఉన్న రొయ్యల ధరకూడా కిలోకు రూ.50 పైనే తగ్గించేశారు. మన దేశం నుంచి అమెరికాకు ఎక్కువగా 40 లోపు కౌంట్ రొయ్యలే ఎగుమతవుతాయి. ఆ దేశానికి 50కు పైన కౌంట్ ఉన్న రొయ్యలు వెళ్లే సమస్యే లేదు. అయినా 100 కౌంట్ రొయ్య ధరను కూడా వ్యాపారులు భారీగా తగ్గించేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు భారత దిగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచుతున్నట్లు ప్రకటించగానే పనిలో పనిగా అమెరికా దేశానికి ఎగుమతి చేయని రొయ్యల ధర కూడా వ్యాపారులు తగ్గించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమెరికా పెంచిన దిగుమతుల సుంకాలు ఈ నెల 7వ తేదీ నుంచి అమలులోకి రాగా, రెండో సారి పెంచిన 25 శాతం సుంకాలు ఈ నెల 27వతేదీ నుంచి అమలులోకి రానుంది. మొత్తానికి ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు ఆక్వా రంగాన్ని అతలాకుతలం చేస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలలో రొయ్యసాగు జరుగుతుంది. సీడ్‌లో నాణ్యత లేకపోవడం, వైరస్ వ్యాధులు ముప్పేట దాడి చేయడంతో మూడొంతుల చెరువులు ఖాళీ అయ్యాయి. ఈ చెరువుల్లో కౌంట్ 200 నుంచి 300 వరకూ ఉండటం, రొయ్యకు సరైన ధర లేకపోవడంతో కనీసం సగం పెట్టుబడులు కూడా దక్కలేదు.

మినహాయింపు కోరాలి



ఆక్వా రంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎన్నికల్లో హామీలు గుప్పించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆక్వా రైతులకు చేసిందేమీ లేదు. అమెరికా విధించిన సుంకాలు ఆక్వా రంగం మనుగడకే ముప్పుగా పరిణమించింది. సుంకాల నుంచి రొయ్య ఉత్పత్తులకు మినహాయింపు ఇచ్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలి. లేదంటే ఇప్పటికే తీవ్ర నష్టాల ఊబిలో ఉన్న రొయ్య సాగుకు మనుగడ ఉండదు.

– దేవారపు బాబులు, రొయ్యరైతు

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం



రోగులకు పళ్లు, బ్రెడ్లు అందజేస్తున్న మానవత కేంద్ర కమిటీ కన్వీనర్ గంగాధరరావు, వైద్యురాలు రేష్మిక

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర కమిటీ కన్వీనర్ రామిశెట్టి గంగాధరరావు అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఆరోగ్య సేవా కార్యక్రమాలను విస్తృత పర్చి ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. పలు ప్రమాదాల్లో నిరాశ్రయులైన వారికి అండగా సంస్థ ఉంటుందన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లోని ఇన్ పెషెంట్లు 125 మందికి ఫ్రూట్స్, పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు రేష్మిక, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, ప్రతినిధులు రమణశంకర్, చిలపర్తి ఆదినారాయణ, పసుపులేటి సాంబశివరావు, వెజ్జు ధర్మారావు, వి.కపిరాజు, ఆర్‌డీఎం ప్రసాద్, ఉన్నమట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీతారాములకు విశేష పూజలు



గుండుగొలనులో స్వామి వార్ల కల్యాణ తంతును నిర్వహిస్తున్న అర్చకులు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీసీతారామస్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రీతికరమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ యాజ్ఞిక స్వామి మోహనకృష్ణ, ఆలయ అర్చక స్వామి సాయిసుధీర్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో శాంతి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వారిని విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



బువ్వనపల్లిలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: బువ్వనపల్లి జగ్గయ్య చెరువు వద్ద వేంచేసియున్న శ్రీకృష్ణుడి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద భజనలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నాణ్యమైన విద్య



గణపవరం డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్న ప్రిన్సిపాల్

గణపవరం: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా నాణ్యమైన విద్య అందుతుందని, అందువలన ప్రభుత్వ కాలేజీలో చేరాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం గణపవరం డిగ్రీ కాలేజీలో యూజీ అడ్మిషన్లు ప్రారంభించారు. కాలేజీలో బీకాం, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉన్నాయని, కాలేజీలో ఆధునిక వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఆమె కొత్తగా చేరే విద్యార్థులకు ప్రవేశాలు ఇచ్చారు.

పిల్లలకు సకాలంలో ఇంజెక్షన్లు చేయించాలి



చిన్నారులకు ఇంజక్షన్లు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: సకాలంలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఇంజక్షన్లు చేయించాలని గోపన్నపాలెం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి రాకేష్ అన్నారు. బుధవారం గోపన్నపాలెం ప్రాథమిక వైద్యశాల పరిధిలో గ్రామాల్లో సంవత్సరం, 5, 10, 16 సంవత్సరాల లోపు చిన్నారులకు ఇంజక్షన్లు చేశారు. దెందులూరులో ఏఎన్ఎం శైలజ వైద్య సిబ్బంది చేశారు. ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ గ్రామాల్లో జరుగుతున్న ఇంజక్షన్ల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నానో ఎరువులను వాడాలి



ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ

దెందులూరు: రైతులు నానో ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. బుధవారం కొవ్వలిలో దెందులూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి ఎల్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రైతులకు పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచనలు సలహాలు వరిగొండలో తీసుకొని పాటు రక్షించుకునేలా మోతాదుకు తగ్గట్టుగానే ఎరువులు వాడాలన్నారు.

జీవిత కాలం అక్షరాస్యత అవసరం



వయోజన విద్య పాఠ్యాంశ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉంగుటూరు: జీవిత కాలం అక్షరాస్యత కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస కార్యక్రమం ప్రవేశ పెట్టిందని ఎంపీడీవో రాజ్ మనోజు అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అక్షఆరాస్యత కలిగి ఉండాలని సూచించారు. బుధవారం డ్వాక్రా భవన్‌లో వయోజన విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉపాధి ఏపీవో వెంకట రమణ మాట్లాడుతూ వ్యవహారిక, డిజిటల్ అక్షరాస్యత, లెక్కలు తెలిసే అక్షరాస్యత ప్రతి ఒక్కరూ కలిగి ఉండటం కోసం ప్రభుత్వం ఈ పథకం ప్రవేశ పెట్టిందని తెలిపారు. వయోజనులు, డ్వాక్రా, ఉపాధి మహిళలు అక్షరాస్యతలో చేరి నేర్చుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకమైన వాలంటీర్లు శిక్షణ పొందిన వారిని నియమించామన్నారు. ఎంఈవో-2 సాయి బాబా, డ్వాక్రా ఏపీవో ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఆఫీసుకు క్యూ కట్టిన పింఛన్ బాధితులు



ఎంపీడీవో రాజ్‌మనోజుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఉంగుటూరు: తమది పేద కుటుంబమని రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితని ఊపిరితిత్తులు దెబ్బతిని ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తోనే బతుకుతున్న దానిని నాకు వచ్చే పింఛన్ రద్దు చేశారంటూ ఎ.గోకవరం గ్రామానికి చెందిన ఆకుల నాగతులసి ఎంపీడీవో మనోజుకు ఆవేదనతో ఫిర్యాదు చేసింది. కన్ను పనిచేయడం లేదు. పింఛన్‌తోనే బతుకుతున్న నాకు పింఛన్ రద్దు చేశారు. ఎలా బతకాలని ఉంగుటూరుకు చెందిన పేడ్ల వరప్రసాద్, యాక్సిడెంట్‌లో చేయి దెబ్బ తినడంతో ప్రభుత్వం ఆరువేలు పింఛన్ ఇచ్చేవారు. అది ఇప్పుడు పింఛన్ ఇచ్చేవారు ఇప్పుడు రద్దు చేసేశారు. ఎలా బతికాలని, ఒక చేత్తో ఏమి చేయలేక పోతున్నానని ఎ.గోకవరానికి చెందిన నెరుసు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. పెరాలసిస్ వచ్చి మంచానికే పరిమితమయ్యాను. ఆరు వేలు ఇచ్చేవారు. ఇప్పుడు బాగందని చెప్పి నాకు పింఛన్ రద్దు చేశారంటూ శ్రీను అనే బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా 47 మందికి పింఛన్ రద్దు కావడంతో వారు ఉంగుటూరు వచ్చి ఎంపీడీవో రాజ్‌మనోజుకు వారి ఆందోళనను జీవన గాథను వివరించారు. బుధ, మంగళ వారాల్లో 47 మంది బాధితులు ఇంటికో రకమైన బాధతో వారు వారి గోడును వెళ్లదీసుకోవడం వారి వంతయ్యింది. రీ వెరిఫికేషన్ పేరుతో మే, జూన్ నెలల్లో ఇంటింటికీ బయట జిల్లాల నుంచి వచ్చిన డాక్టర్ల బృందం సభ్యులు బెడ్‌రిడెన్ పేరుతో పింఛన్లుత అందుకుంటున్న వారి ఇళ్లకు తిరిగి పరిశీలించారు. వారి పరిశీలన అనంతరం 40 శాతం కంటే వైకల్యం లేని వారికి పింఛన్ అవసరం లేదని తేల్చి చెప్పేశారు. దీంతో ఇప్పటి వరకు నెలకు ఆరు వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందుకున్న వారు రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో కాలం వెళ్లదీసిన తాము ఎలా బతికేదని కనిపించే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవిస్తున్నారు.

ముంపు పొలాల పరిశీలన

పెదపాడు: ముంపునకు గురైన పంట పొలాల్లో తెగుళ్ల నుంచి పంటను కాపాడేందుకు కార్బెన్డిజమ్ లీటరు నీటికి ఒక గ్రామ్ పిచికారీ చేయాలని ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణికుమార్, శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు తెలిపారు. బుధవారం పెదపాడు మండలంలోని కొణికి, సత్యవోలు గ్రామాల్లో పంట పొలాలను వ్యవసాయ అధికారి షేక్ ఇమామీ ఖాసితో కలిసి పరిశీలించారు. బుడమేరు పొంగడంతో పంట పొలాలు నీట మునిగినట్లు చెప్పారు. ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణికుమార్, శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు మాట్లాడుతూ వరి పొలాలన్నీ 20 నుంచి 30 రోజుల కాల పరిమితితో ఉన్నందున నీరు బయటకు పోయిన తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాషియమ్‌ను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని సూచించారు. ముంపును తట్టుకునే వరి రకాలైన ఎంటీయూ 1232, ఎంటీయూ 1140 రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సహాయకురాలు దీపిక పాల్గొన్నారు.

బాబు అంటేనే మోసం.. జగన్ అంటే నమ్మకం



యర్రంపల్లి గ్రామంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి : రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోతో బాబు అంటేనే మోసం, జగన్ అంటే నమ్మకం అని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి పిలుపునిచ్చారు. చింతలపూడి మండలం యర్రంపల్లి గ్రామంలో జానకి రెడ్డి ఇంటి ఆవరణలో బుధవారం పార్టీ గ్రామస్థాయి విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు ఎస్ రమేష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. జానకిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగి పోయాయని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కూడా విఫలమైందని తెలిపారు. తగినన్ని బస్సులు ఏర్పాటు చేయకుండా మహిళలను ఉచిత బస్సు పేరుతో మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు వస్తున్న ఆదరణ చూసి ఆయన పర్యటనలను అడ్డుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ప్రజలే తగిన విధంగా కూటమి అక్రమ పాలనకు అంతం పలుకుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, ఎంపీటీసీ మేరి, రైతు విభాగం నాయకులు శ్రీనివాసరెడ్డి, సురేష్, చింతం రాణి, గొంది రాజు, కుమారి, నరసింహారావు, బుల్లా దాసు, టీఆర్‌కే రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ కార్మికులు జాగ్రత్తలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై జయబాబు

టి.నరసాపురం: ఆయిల్‌పామ్ గెలలు కోసే సమయంలో కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్సై ఎం.జయబాబు సూచించారు. టి.నరసాపురం శివాలయ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గెలల కోసే సమయంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఎస్సై జయబాబు మాట్లాడుతూ విద్యుత్ శాఖ నుంచి లైన్ క్లియరెన్స్ తీసుకున్న తరువాతే ఆయిల్‌పామ్ గెలులు కోయాలని సూచించారు. అన్నింటికన్నా ప్రాణం విలువైనదని వివరించారు. టి.నరసాపురం ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు టూ ఫేజ్ సప్లయి సమయంలో లైన్ క్లియరెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. రైతులు అవసరమైన చోట ట్రాన్స్‌కో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, లైన్ షిఫ్టింగ్‌లు చేపట్టాలని కోరారు. నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏరియా మేనేజర్ రెడ్డి మాట్లాడుతూ గెలులు కోసే కార్మికులు విధిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ఫ్యాక్టరీ తరుపున సమకూర్చుతున్న బూట్లు, గ్లౌజ్‌లు విధిగా వాడాలని సూచించారు. సమావేశంలో బొర్రంపాలెం ఏఈ శ్రవణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక, ఉద్యానశాఖ ఇన్‌ఛార్జ్ అధికారి షాపియా షహరీన్, సొసైటీ మాజీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, ఆయిల్‌పామ్ రైతు ప్రతినిధి పెట్టిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పవిత్రారోహణ





పవిత్రాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు. పవిత్రాలతో దర్శనమిస్తున్న స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్రారోహణను అర్చకులు వేడుకగా నిర్వహించారు. యాగశాలలో ఉంచిన పవిత్రాలతో అర్చకులు, పండితులు ఆలయ ప్రదక్షిణలను నిర్వహించారు. పవిత్రాలను వేద మంత్రోచ్చరణల నడుమ శ్రీనివాసుని మూలవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపైనా, ఆలయంలో కొలువైన సుబద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, ఆళ్వార్లపైను ఉంచారు. తర్వాత ఆలయ యాగశాలలో పవిత్రాంగ హోమం, శాంతి హోమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కుక్కునూరు: గోదావరి వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కుక్కునూరు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రామానికి పరిహారం అందించాలని కోరారు. ఈనెల 23 నుంచి ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బండి వెంకటేశ్వర్లు, కిషోర్, కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, సోడే అనిత, సోడే తను పాల్గొన్నారు.

దోమల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



భీమడోలు: పూళ్లలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



గణపవరం: దోమల నివారణపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది



దెందులూరు: దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భీమడోలు: దోమల రహిత సమాజ స్థాపనలో దోమల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని పూళ్ల వైద్యాధికారిణి డాక్టర్ పి.అరుణజ్యోతి అన్నారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పూళ్లలో అవగాహన ర్యాలీ, కరపత్రాలను అందించారు. దోమల నివారణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫ్రైడే డ్రైడేగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, పీహెచ్‌ఎన్ అనురాధ, హెచ్‌ఎస్ పి.మావుళ్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

గణపవరం: అన్ని రోగాలకు మూలం దోమలేనని, దోమల నిర్మూలనతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్, కిరణ్మయి అన్నారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది దోమల నివారణపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయని, అందువలన దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణపై అవగాహన

దెందులూరు: దెందులూరులోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీ కన్య గ్రామ ప్రజలకు దోమల నియంత్రణపై అవగాహన కల్పించారు. వర్షాలకు నీటి నిల్వలు పెరుగుతున్న నేపథ్యంలో దోమల సంఖ్య పెరిగి మలేరియా డెంగీ వ్యాధులు ప్రబలుతాయన్నారు. సురక్షితమైన తాగునీరు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తీసుకుంటూ ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలు గుర్తించినా సమీప ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: ఉంగుటూరు సెక్షన్ యర్రమళ్ల సబ్ స్టేషన్ వద్ద భారీ గాలీ, వర్షానికి పడిపోయింది. పడి పోయిన లైన్ పునరుద్ధరణ పనుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలోగల అన్ని ఫీడర్లకు 21వ తేదీ ఉద యం 9నుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. అందువలన సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు గృహ అవసర వినియోగదారులకు, ఉంగుటూరు గ్రామంలోని పరిశ్రమలకు విద్యుత్ దఫదఫాలుగా సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్‌ను తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 9 గంటల వరకు ఇస్తామన్నారు.

సమస్యలపై వినతి

జంగారెడ్డిగూడెం: స్థానిక కూరగాయల డైలీ హోల్ సేల్ మార్కెట్లో ఉన్న పంది, ఇతర జంతువుల మాంస విక్రయ కేంద్రాలను పట్టణానికి దూర ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, కోనేరు చెరువు చుట్టూ వాకర్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, వర్తకులకు పార్కింగ్, విశ్రాంతి షెడ్లు ఏర్పాటు చేయాలని బీజేపీ, విశ్వహిందూ పరిషత్తు, సమరసతా సేవ ఫౌండేషన్, హిందూ సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.